క్లుప్తంగా

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారన్నారు. సమావేశంలో మెప్మా సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

మందస: పట్టణంలోని వాసుదేవ పెరుమాళుని ఆలయం పక్కనే ఉన్న రాజులు నిర్మించిన గోపాలసాగరం ఆక్రమణలను అధికారులు శుక్రవారం తొలగించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు గట్టును కూల్చి ప్లాట్లకు దారి వేసి నట్లు జలవనరులశాఖ ఏఈ ఎస్.వి.శ్రీనివాసరావుతో పాటు సర్వేయర్లు, సచివాలయం సిబ్బంది గుర్తించి చర్యలు తీసుకున్నారు. అలాగే గట్టు నుంచి వేసిన రహదారిని స్వాధీనం చేసుకున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర, కొల్లిపాడు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను కేంద్ర బృందం సభ్యులు గిరిజాశంకర్ పాడి, సత్యరంజన్ రౌతు శుక్రవారం పరిశీలించారు. చెరువు పనులను, హార్టికల్చర్, ఇళ్ల నిర్మాణాల పనులు పరిశీలించారు. కేంద్ర పథకాలతో ఏ మేరకు లబ్ధి చేకూరుతోందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాసుందరి, ఏపీవో వాసు నాయుడు, ఈసీ మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి

ఇచ్ఛాపురం: ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ ఆర్‌ఈ సీహెచ్ ప్రసాద్ సూచించారు. పట్టణంలో హెల్మెట్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వలనే కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి అపరాధ రుసుము విధించకుండా, హెల్మెట్ కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

వజ్రపుకొత్తూరు: జీడిలో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యానవన శాఖ అధికారి కె.సునీత అన్నారు. మండలంలోని పాత టెక్కలి, అమలపాడు గ్రామాల్లో తోటబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడి మామిడిలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. కాండం, వేరు తొలిచే పురుగుల నివారణకు తగిన మందులు అందుబాటులో ఉన్నాయని, అధికారుల సూచనలతో వాడుకుంటే పంటలను రక్షించుకునేందుకు వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు ప్రశాంత్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రాలను శుక్రవారం అందజేశారు. కోత అప్పాజీ, సన్యాసమ్మ మెరిట్ అవార్డ్స్ కింద బెవర లావణ్య, భాగవత్తుల సాయిప్రణీత్, అనితలకు బహుమతులు అందజేశారు. అలాగే లమ్మత నారాయణమ్మ, చిన్నయ్య మెరిట్ అవార్డ్స్‌ను బాలికల్లో సత్తా చాటిన వల్లభ పావని, కొండాల కావ్య, వాగ్దేవు జాస్మిన్‌లకు అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి కోత మధుసూదనరావు, కోత ధర్మారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరభద్రరావు భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొందల రామకష్ణ, కోత సతీష్, మార్పు నాగభూషణరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డుకు చెందిన నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి జైజగన్నాథ ఒడియా బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందించారు. స్థానిక శివాలయంలో రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాఘవ పండా, సంతోష్ కుమార్ పండా, ప్రసాద్ పాత్రో, ఈశ్వర పాత్రో తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు



కోటబొమ్మాళి: లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- మూలపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

కోటబొమ్మాళి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తెలియజేశారు. మండలంలోని లఖందిడ్డి–2 సచివాలయం పరిధిలోని మూలపేట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చాణిక్య, వీఆర్వో సూర్యనారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వై.జ్యోషితారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ రంజాన్‌రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కవిటి రామరాజు, ఎంపీటీసీ చుక్క లోకనాథం, సర్పంచ్‌లు బమ్మిడి గణపతి, నూక సత్యరాజ్, కాల్ల సంజీవరావు, సుంకరి జనార్దన, బొడ్డు వెంకటరమణ, అల్లు ప్రసాద్, బలగ సూర్యారావు, మొజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరించండి

టెక్కలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని తొలుసూరుపల్లి, పాత నౌపడ, పెద్దరోకళ్లపల్లి, అయోధ్యపురం, రావివలస, తలగాం గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద 'మా నమ్మకం...నువ్వే జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి పక్షపాతం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. జెడ్పీటీసీ దువ్వాడ వాణి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్ జి.సుజాత, వైస్ ఎంపీపీలు పి.రమేష్, ఎం.కిషోర్, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు బి.హరి, ఎస్.బాలకృష్ణ, పి.హేమలత, బి.రామకృష్ణ, డి.రంగబాబు, హెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.సోమేష్, వి.అశోక్, సీహెచ్ బాలకృష్ణ, డి.శ్రీను, పి.రమణబాబు, డి.లోకేశ్వరరావు, జె.యోగి, ఆర్.మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు పెద్దపీట

నందిగాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శకతకు పెద్దపీట వేయడం జరుగుతోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో జగనన్న సచివాలయ మండల ఇన్‌చార్జి జడ్యాడ జయరాం ఆధ్వర్యంలో 11 సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందన్నారు. వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కింతల ధర్మారావు, యర్ర చక్రవర్తి, తమిరె ఫాల్గుణరావు, తమిరె బలరాం, రోణంకి ఢిల్లేశ్వరరావు, పోలాకి మోహనరావు, పిన్నింటి జయరాం, బాలక మధు, కణితి నారాయణమూర్తి, దీర్ఘాశి కృష్ణారావు, సైలాడ లవన్న, కోనారి రామారావు, శాంతారావు, మడపాల తిరుపతిరావు, బూరె మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి

టెక్కలి: ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేయలేదని రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రైల్వే ఫ్లై ఓవర్‌ను పూర్తి చేస్తాం



పల్లివీధిలో గడప గడపకూ కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- పలాసలో గడప గడపకూ మన ప్రభుత్వం

కాశీబుగ్గ: మున్సిపాలిటీలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేస్తామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలియజేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వ వార్డులో కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి తక్షణమే అధికారుల సమక్షంలో పరిష్కారం చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. 12వ వార్డు అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని, రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. వార్డులో ఉన్న సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల పనితీరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్‌కుమార్, పలాస మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్, తహసీల్దార్ మధుసూదనరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, విప్ శంకర్‌పండా, మహిళా అధ్యక్షురాలు బోర చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

● చిద్విలాసం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వ వార్డులో శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పల్లివీధికి చెందిన అన్నపూర్ణ అనే అవ్వతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా అవ్వ ఉత్సాహంగా నవ్వుతూ కనిపించారు. నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు.

– కాశీబుగ్గ

ఆక్రమణలు తొలగించాలని ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

కోటబొమ్మాళి: మండలంలోని దుప్పలపాడు పంచాయతీ కొప్పలపేట గ్రామంలో చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలు తక్షణమే తొలగించి, ఉపాధి హామీ పనులతో పూర్వ వైభవం తీసుకురావాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు ఆక్రమణలను శుక్రవారం పరిశీలించారు. అంతకుముందు చిట్టివలస పంచాయతీ చవితిపేటలో సచివాలయ సిబ్బందితో గ్రామ సమస్యలపై సమీక్ష చేపట్టారు. గ్రామస్తులు తెలిపిన పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని, ఉపాధి పనులు చేపట్టాలని, భూసర్వే పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, డీటీ మధు, ఆర్‌ఐ శివ, సర్పంచ్ ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం నేడు



మాట్లాడుతున్న ఎంపీపీ డొక్కరి దానయ్య

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన అంబుగాం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు తెలియజేశారు. శుక్రవారం ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వారితో పాటు ఏపీవో బి.వి.హరికృష్ణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరునగరి సవరయ్య, సాలీన లక్ష్మీనారాయణ, మజ్జి హేమరాజు, కొల్లి మాధవరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు



పూర్ణ కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలో బైరాగిపుట్టుగ గ్రామంలోని కొట్టియా వీధిలో గ్రామదేవత అసిరి పోలమ్మ ఆలయ ప్రతిష్ఠా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. దీనిలో భాగంగా శుక్రవారం ప్రతీ ఇంటి ముందు ఏర్పాటు చేసిన పూర్ణ కలశాలను మహిళలు తమ తలపై పెట్టుకుని శోభాయాత్రగా వెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం గ్రామ ప్రజలకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ



మహ్మద్ అలీ

కోటబొమ్మాళి: స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా షేక్ మహ్మద్ అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదివరకు నౌపడా ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన షేక్ ఖాదర్‌బాషా శ్రీకాకుళం వీఆర్‌కు వెళ్లారు.

'ఆర్‌బీకేలను సంప్రదించండి'

టెక్కలి: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు మిల్లర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆయా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని బొప్పాయిపురం సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి సూచించారు. పంచాయతీలోని అక్కవరం ఆర్‌బీకేలో రైతులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా ధాన్యం కొనుగోలు చేయకపోతే తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో వీఏఏ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

నౌపడ ఎస్‌ఐగా లావణ్య



సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ ఎస్‌ఐగా బి.లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన మహ్మద్ అలీ కోటబొమ్మాళికి బదిలీపై వెళ్లారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



మాట్లాడుతున్న డీఈఈ శేషయ్య

కవిటి: వైఎస్సార్, జగనన్న కాలనీల్లో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ డీఈఈ పి.శేషయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉగాది నాటికి అధిక శాతం లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించేలా కచ్చితమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికి 1431 ఇళ్లు ఆన్‌లైన్‌లో మంజూరయ్యాయన్నారు. బీబీఎల్ స్థాయిలో 325, బీఎల్ స్థాయిలో 361, ఆర్‌ఎల్ స్థాయిలో 155, ఆర్‌సీ స్థాయిలో 201 ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో హౌసింగ్ ఇంజినీర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఏడీ తిరుమలరావు

కోటబొమ్మాళి: రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఏడీ తిరుమలరావు అన్నారు. మండలంలోని జియ్యన్నపేట ఆర్‌బీకేలో వ్యవసాయ సలహా మండలి ఆధ్వర్యంలో రైతులతో అవగాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇప్పటికే మండలంలో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసిందని, అనుమతి రాగానే మరో 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏవో గోవిందరావు, ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా నిర్మాణ పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

సోంపేట: మండలంలో జరుగుతున్న సచివాలయాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మండలంలో నాడు–నేడులో జరుగుతున్న పాఠశాల భవనాల పనులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలు, జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, పంచాయతీరాజ్ జేఈ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై శ్రద్ధ వహించాలి



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కంచిలి: దివ్యాంగులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని భవిత కార్యాలయంలో దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత ఉపకరణాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు మంచి చేసే విషయంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి, మండల విద్యాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీసీ పండా, ఎల్.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

టెక్కలి: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యురాలు గాయత్రీ సూచించారు. కుష్టు వ్యాధి నియంత్రణలో భాగంగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంపై ఎటువంటి మచ్చలు కనిపించినా తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న సమన్వయకర్త పిరియా సాయిరాజు

- పిరియా సాయిరాజ్
- వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్ష

ఇచ్ఛాపురం రూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కల్యాణ మండపంలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్వీనర్లు, గృహ సారథుల కృషికి పార్టీలో ఉన్నత విలువలతో పాటు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వంపై టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అందరం పనిచేయాలన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, ఏఎంసీ చైర్మన్ ఎన్.బాబూరావు, వైస్ ఎంపీపీలు దున్న గురుమూర్తి, దువ్వు వివేకానందరెడ్డి, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, రాంపత్ని చిట్టిబాబు, మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

15 వరకు ధాన్యం కొనుగోళ్లు

ఈనెల 15వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్లకు అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పిరియా సాయిరాజు అన్నారు. ఇచ్ఛాపురంలో తనను కలిసిన రైతులు ధాన్యం కొనుగోలుపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆయన తహసీల్దార్ ఎస్.గురుప్రసాద్, వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవితో మాట్లాడారు. అలాగే ఉన్నతాధికారులతో మాట్లాడి నిల్వ ఉన్న ధాన్యంను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సల్ల దేవరాజు, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, సాలిన ఢిల్లీ, లోపింటి దీనబంధురెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఘన నివాళులు



కళా తపస్వి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: కళా తపస్వి కె.విశ్వనాథ్ మృతికి వేంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ప్రతినిధులు నివాళులర్పించారు. అకాడమీ ఆవరణలో అధ్యక్షుడు చిన్నాగురుస్వామి అధ్వర్యంలో విశ్వనాథ్ చిత్రపటానికి అంజలి ఘటించారు. కార్యక్రమంలో నాట్య గురువు శృతిపట్నాయక్, జయలక్ష్మి పట్నాయక్, అంకిత తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని జింకిభద్ర పంచాయతీకి చెందిన రంగోయి భీమారావు, పండి సోమేశ్వరరావులు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు చొప్పున సర్పంచ్ తామాడ పద్మావతి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్, ఉప సర్పంచ్ సాహుకారి జానీ, పెద్దకోట అనంత్, ఎన్ని అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కాశీబుగ్గ: జాతీయ, రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం అభినందించారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో బాలుర టీమ్‌లో ద్వితీయ స్థానం సాధించిన రాష్ట్ర జట్టుతో పాటు, డబుల్స్‌లో తృతీయ స్థానం సాధించిన జట్టులో పలాస క్రీడాకారుడు బి.సిద్ధార్థ సభ్యునిగా ఉన్నాడు. అలాగే ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరులో జరిగిన అండర్–14 టెన్నికాయిట్ పోటీల్లో బి.సిద్ధార్థ రాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించాడు. అదేవిధంగా టీమ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన జట్టులో పాఠశాల విద్యార్థులు బి.సిద్ధార్థ, టి.వెంకటేష్, అండర్–17లో తృతీయ స్థానం సాధించిన జట్టులో కె.ప్రవీణ్‌కుమార్, ఎల్.రాజు ఉన్నారు. దీంతో వీరిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ బి.శంకర్‌రావు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి శ్మశానవాటిక కోసం స్థలాన్ని సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. అనంతరం సచివాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోలాకి రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, సర్వేయర్ శశి, గ్రామ రెవెన్యూ అధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు టీకాలు వేయించాలి



మూగజీవాలకు టీకాలు వేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: పాడి రైతులు మూగ జీవాలకు టీకాలు వేయించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గోవిందపురంలో మూగజీవాలకు టీకాలు వేసే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పెంపకందారులకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తోందన్నారు. కార్యక్రమంలో రైతులు డొక్కరి మోహనరావు, బూసయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నబమ్మిడి యూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ శుక్రవారం పరిశీలించారు. జగనన్న గోరుముద్ద మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.